

# ధ్వంసరచన

## సౌమ్య

ఆ ఉదయం ఒంటరిగా కొండదారి మీద కారులో వెళుతుండగా నా మనసెందుకో ఆకస్మాత్తుగా కలవరం చెందింది. పదిహేనేళ్ళకిందటిలా తిరిగి ఆందోళనకు లోనైంది. ఇన్నాళ్లూ బిగించి ఉంచిన కళ్ళేలను తెంచుకుంది. ఇదేమిటిదేమిటని మునుపటి ప్రశ్నలను గుప్పించసాగింది.

ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆలోచన్లను మరోదారి పట్టించాను. కాంట్రాక్టు తీసుకున్న వంతెన్ను నెల రోజుల్లో కట్టించేస్తే రాబోయే లాభాన్ని లెక్కగట్టాను. దాన్ని బట్టల మిల్లులో పెట్టుబడి పెడితే రెండేళ్లలో వచ్చే డివిడెండు అంచనా వేశాను. అంతా బాగానే ఉంది! కార్మికుడు, కర్షకుడు, యజమాని, భూస్వామి— అందరికీ లాభమే...అంతా అభివృద్ధే! అశాంతికి, అసంతృప్తికి ఇక తావెక్కడ?

అయినా ఎవరో అరుస్తూనే ఉన్నారు- కొండవాగు హొయలును, అడవి పూల వాసన్ను ఆస్వాదించకుండా నన్నారడి పెడుతున్నారు.

కారు నే కొట్టించే కొండ దగ్గరికి చేరింది. సిగిరెట్టు ముట్టించి, కార్లోంచి దిగాను. కొండమీదనుంచి నా మేనేజరూ, గుమాస్తా చేతులూపుతూ నా దగ్గరకు దిగి వస్తున్నారు.

ఉలులు, సమ్మెటలు, తట్టలు అవిరామంగా శబ్దం చేస్తున్నాయి. కొండరాళ్ళు పగులుతూ కుయ్యోమంటున్నాయి. నెల రోజులకిందట ప్రశాంతంగా ఉన్న ఆ ప్రాంతం, కొండమీద నేను క్వారీ పెట్టించగానే రణగొణ ధ్వనితో నిండిపోయింది.

గుమాస్తా, మేనేజరు నా దగ్గరకు చేరారు. సిగరెట్టు విసిరేశాను.

"ఎలా సాగుతోంది పని?" అడిగాను.

"ఓ! జోరుగా సాగుతోంది" అన్నాడు గుమాస్తా.

"ఎటొచ్చీ ముఠావాళ్ళే కొద్దిగా సణుగుతున్నారు!" చెప్పాడు మేనేజరు.

"ఏవిటట?" అంటూ కొండ ఎక్కసాగాను. వాళ్ళు నన్ననుసరించారు.

"ఊళ్ళొదిలేసుకొచ్చి రెండేళ్ళయింది ...ఈ కష్టం ఉన్న ఊళ్లోనేపడుంటే అని ఆలోచిస్తున్నారు" నసుగుతూ చెప్పాడు మేనేజరు.

"ఆఁ! ఉన్న ఊళ్ళోనే చావక పోయారా? అప్పుడు కరువొచ్చి... పన్లుదొరక్క... ఎంతిస్తే అంతే చాలని పరిగెత్తుకొచ్చారు! ఇప్పుడు కడుపునిండా దొరికేసరికి ఆశ మరింత దూరం లాగుతోంది..." అక్కసంతా మేనేజరు మీద వెళ్ళగక్కాను.

అతనేమి చెబుతాడు?

"అంతే సార్...అంతే!" అన్నాడు. గుమాస్తా కొద్దిగా గడుగ్గాయి...


"చలికాలం... ఒంటినిండా కప్పుకునేందుకు గుడ్డలైనా లేవని గోల పెడుతున్నారు... పండిక్కి ఇనాం యిస్తారేమోనని ఆశ పడుతున్నారు" చెప్పాడు.

"వాళ్ళ పుర్రెకు పుట్టిన బుద్ధా? నువ్వేమైనా ఎక్కేశావా?" కోపంగా అడిగాను.

"అయ్యయ్యో! ఎంతమాట! వాళ్ళు ఎప్పుడో వెనకాముందూ చూసుకోకుండా వుంటారా? రెండేళ్ళ కింద మన వెంట వచ్చారు. అడవుల్లో, గుట్టల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు... యిన్ని రోజుల్లో వాళ్ళకు మిగిలింది మన దగ్గర అప్పులు తప్ప ఏమీలేదు కదా..." నాకు నచ్చజెప్పగలుగుతున్నానని భ్రమపడ్డట్టున్నాడు... తెగించి ఉపన్యాసం ఇచ్చాడు.

"గుమాస్తా... మార్క్సిజం చెబుతున్నావా? న్యాయం మాట్లాడుతున్నావా?" కర్కశంగా అడిగాను.

"అయ్యయ్యో! ఎంత మాట! ఈ కొండమీదవాళ్ళకి కంపరమెత్తినట్లుంది-




యిన్నాళ్ళూ లేంది ఇప్పుడు మరోచోట ఎక్కడైనా పని వెతుక్కుంటామంటున్నారు...మనకైనా ఇంత నమ్మకమైన మరో ముఠా దొరకడం కష్టమే కదా! అందుకని..." నాన్చాడు.

"అందుకని?" వెటకారంగా అడిగాను.

"...అందుకని... ఈ పండక్కి అయ్యగారేదైనా ఇనాం ఇస్తార్లే అని నచ్చజెప్పాను."

"ఎవర్నడిగి చెప్పావ్?" అకస్మాత్తుగా ఆగి గుమాస్తాని కసిరాను. అతను నీళ్ళు నమిలాడు.

మేనేజరు అందుకున్నాడు.

"అడగడమంటే... మిమ్మల్ని సంప్రదించే సమయం లేకపోయిందండీ! మొన్న మరీ ఆగడం చేశారు. వీళ్ళు అకస్మాత్తుగా వెళ్ళిపోతే పని ఆగిపోతుందని అప్పటికలా చెప్పాం... నిన్న మీకు ఫోను చేశాం."

మేనేజరు గొంతులోని సిన్సియారిటీనో లేకుంటే— 'అప్పటికలా' అన్నమాటో నన్ను చల్లబరచింది.

"సరే— ఈ కాంట్రాక్టు అంత లాభసాటిది కాదు గనుక— మళ్ళీసారి కాంట్రాక్టులో ఏదైనా ఇద్దాం!" అన్నాను.

"వాళ్లూరుకోరేమో?" మళ్ళీ అన్నాడు గుమాస్తా.

"ఊరుకోక ఏం చేస్తారు? మహా అయితే పోతారు... అంతేగా... రెండ్రోజుల్లో నెల్లూర్నించి ఇంకో ముఠా తెస్తాను" నా మనసులోని మాటను మేనేజరు బయటకన్నాడు.

"అంతదాకా వస్తే అంతే— అయినా నే మాట్లాడతాగా వాళ్ళతో— అప్పుడు చూద్దాం!" చెప్పాను.

'ఏమిటి చూస్తావ్? ఏం మాట్లాడతావ్?' అరిచారెవరో.

పొద్దుటినుంచి లీలగా వినిపిస్తున్న ఆ కేకలు స్పష్టమైనై.

'ఏమిటి చూసేది?' నిలదీసిందా గొంతు నన్ను.

ఉలిక్కిపడ్డాను. అది ఆయన గొంతే!.

పదిహేనేళ్ళకిందట- నా కలవరింతలో, పలవరింతలో, కన్నీళ్ళలో, కవిత్వంలో- అనుక్షణం- అహరహం వెన్నంటింది ఆయనే!

ఆయన బంధనం నుంచి ఎలా బయటపడ్డాను- పడ్డ తర్వాత ఇక ఆయన దాపుకైనా వెళ్ళలేదు!

మళ్ళీ ఈనాడు అవే కేకలేస్తున్నాడు- ఒకటే తేడా! ఆనాడు ఆయనతో శ్రుతి కలిపేవాడిని- నేడు నన్నే ముద్దాయిని చేస్తున్నాడు...

'కార్మికధీరుల విలాపాగ్నులకు విషాదాశ్రులకు ఖరీదుకట్టే షరాబులేడోయ్' అని హెచ్చరిస్తున్నాడు.

తల విదిలించి ముందుకు నడిచాను.

ఆయన సమరగీతాలు పాడుతూ వెంటాడుతున్నాడు.

* * *

నేనూ, మేనేజరూ, గుమాస్తా క్వారీ దగ్గరికి చేరాం. కూలీలు పనులాపి నాకు దణ్ణం పెట్టారు. తల ఊపుతూ, చల్లటి పాకలోకి వెళ్ళాను.

గుమాస్తా భక్తిగా బంగినపల్లి మామిడి పళ్ళూ, కొత్తకుండలో నీళ్ళూ నా ముందు పెట్టాడు. వాటిని మాయంచేసి చల్లబడ్డాను. 'మేస్త్రీలను పిలవండ'ని చెప్పాను.

అయిదు నిమిషాల్లో రామయ్యా, వీరన్నా నా ముందు చేతులు కట్టుకు నిలబడ్డారు.

"ఏమిటి సమస్య?" నిలదీశాను.

కాసేపు నీళ్ళు నమిలారు.

"రోజూ కూలీ మాకలకే సాలడం లేద్దొరా! కానా కట్టంగా ఉంది" అన్నాడు వీరన్న.

"అయితే?"

"కూలీ రెండ్రూపాయలు పెంచుతారేమోనని—"

"రెండ్రూపాయలా? మీకు నవ్వులాటగా వుందా! ఈ కొండమీద కాంట్రాక్టుతో నేను కోట్లు గడిస్తున్నాననుకున్నారా?" విరుచుకుపడ్డాను.

"ఊళ్ళ దులుకుని కొండల్లో కొచ్చినం- అయినా పొట్టనిండడంలేదు! వొంటిమీద బట్టలు కూడా పినిగిపోయినై- మీరే ఏదో దారి సూపాల" అన్నాడు రామయ్య.

"నన్నేం చేయమంటార్రా! నష్టమొస్తున్నా మాట్లాడుకున్న కూలీ మీ ముఖాన కొడుతూనే ఉన్నాగా? పైగా మీలో నా దగ్గర అప్పులేని దెవడికో చెప్పండి?" అడిగాను.

హత్య కేసులో ఇరుక్కున్న ముద్దా

యిల్లా తలలొంచుకున్నారు వాళ్ళు.

"ఇష్టమైతే చెయ్యండి! లేకుంటే పొండి! రేపు ఇంకో ముఠాను తెచ్చి పెట్టుకుంటా! కరువుకు నకనకలాడు తున్న వెధవల్ని చేరదీసి పనులు చూపించాను గుర్తుందా! ఆ విశ్వాసం లేదేమిరా! పనులు పనుయానికి కొంత నష్టాలొస్తున్నా— వోళ్లే శానాకాలం నుంచి ఉంటున్నారని ఊరుకున్నాను— ఇప్పుడు నా నెత్తికే ఎక్కుదామను కున్నారా—" నా ఎదురుదాడికి వాళ్ళు జవాబు చెప్పలేక గుటకలు మింగారు.

ఉత్సాహంగా మరింత కోపం తెచ్చుకున్నాను. "నేను లేనప్పుడు పనులు మానేస్తామని స్ట్రయికుచేస్తార్రా స్ట్రయికు" కర్కశంగా అడిగాను.

"నిజంగా మానేత్తామన్లేద్దొరా! ఏదో ఓరోజు సీకాకు జేసిన్రు... ఆ కోపంలో గుమాస్తామీద ఎగిర్నం— అంతేగాని మీ కెదుర్తిరగ్గలవా బాబూ!" నసిగాడు వీరన్న.

'దారి కొచ్చారు' నవ్వింది నా మనసు. ఇక ధోరణి మార్చొచ్చు.

"ఆడోళ్ళ దేవుందిరా— తాహతెంతో తెలుసుకోకుండా ఆళల్తో మేడలు కడ్తారు. ...మిమ్మల్నెగదోస్తారు. రేపు పనుల్లేక మీరు బజార్లలోపడితే వాళ్ళే మిమ్మల్ని తిడతారు— అంతేనా?" అన్నాను కాస్త మెత్తగా.

"సిత్తం" అన్నాడు వీరన్న.

ఇంతలో అయిదేళ్ళ బుడతడు పాకలోకి పరుగెత్తుకొచ్చాడు. రామయ్య వాడి చెయ్యిపట్టుకొని నాకేసి తిరిగాడు.

"సూడు దొరా! ఈడ్నా కొడుకు! సదువు సెప్పించమని నా పేణం తింట న్నాడు! సలికాలం వొంటిన గుడ్డయినా కొనియ్యలేకపోతిని ఈడికి— సదువెట్టా సెప్పించగల్ను?" అన్నాడు విష్టూరంగా.

"నువ్వేమైన కలెక్టరువురా— వాడ్ని కాన్వెంట్లో చదివించి పెద్దోణ్ని చెయ్యడానికి? వాడొంటిన బట్టల్లేకపోవడం నా తప్పులా మాట్లాడతావ్?" అడిగాను కోపంగా.

"లేద్దొరా— నే నట్టా అన్లేదు."

"నురెట్టన్నావ్? రోజుకు నువ్వెంత తాగుతావొరే!" అడిగాను.

వాడు మాట్లాడలేదు.

"చెప్పు" గట్టిగా అడిగాను.

"అయిదు రూపాయల్ది తాగుతావా—" రెట్టించాను.

తలూపాడు.

"నీ కూలీలో మూడోవంతు తాగుడుకే పోస్తుంటివి— నా ఆదాయంలో నేను మూడోవంతు తాగుతే చిప్పెత్తుకోవాల్సిందే! నేనీ స్థితికి రావడానికి ఎంత కష్టపడ్డానో తెల్సా! నీలా తాగితే నీలాగే ఉండేటోణ్ని."

వాళ్ళిద్దరి ముఖాలు నల్లగా మాడిపైనై.

ఇక తెగేదాక లాగకూడదని...

"మంచిగా పనిచేసి మంచిగా ఉండండిరా

—మీ కష్టం నే నెప్పుడైనా ఉంచు కున్నానా? వెధవ తాగుడుతో వొళ్ళూ, ఇల్లూ గుల్లచేసుకోకండి— నాలుగు రాళ్ళు వెనకేసుకోండి— ఒక్కో కాంట్రాక్టు పట్టుకోవడానికి నాకెంత ఖర్చవుతోందో తెల్సా మీకు? ఎందరికి లంచాలు మేపాలి? ఎన్ని కాళ్ళు పట్టాలి— అవన్నీ మీ కక్కర్లేదు—"

ఇద్దరూ తలలూపారు.

"సరే? కొండమీద పనైన తర్వాత బెజవాడ దగ్గర నురో కాంట్రాక్టు మొద లెడుతున్నా— అది మొదలవగానే ఏదో ఇనాం ఇస్తాలే— మీరే చూస్తున్నారుగా— ఈ క్వారీలోకి లారీ తోలించడానికే ఎక్కడి డబ్బూ చాలడంలేదు? నా నష్టం కూడా మీరు చూడొద్దా? నా దగ్గరుంటే ఒక పని తర్వాత ఒక పని మీకు చూపిస్తా— వేరే దగ్గరికెళితే మీకిట్లా రోజూ పని దొరుకుతుందా?" అన్నాను.

వాళ్ళు చల్లబడ్డారు. తర్వాత కాసేపు వాళ్ళకి నాలుగు సరదా కబుర్లు చెప్పి పంపించేశాను.

మేనేజరూ, గుమస్తా తృప్తిగా తల లాడించారు.

"ఏంటోయ్— ఈ రామయ్యగాడికి పొగరెక్కినట్లుంది? ఇక లాభంలేదు... తాగున్నప్పుడో, దేని దగ్గరైనా తొంగు న్నప్పుడో పట్టుకొని పన్లోంచి తీసే యండి" చెప్పాను.

"వాడు మంచి పనోడు సార్" గునిశాడు గుమాస్తా.

"ఎంత పనోడైనా తలెగరేసేవరకే- లేకుంటే వాడు మనకే ఎసరు తెస్తాడు తెల్సిందా?"

మళ్ళీ తలలూపారు ఇద్దరూ.

గుమస్తా బయటకెళ్ళగానే మేనేజరుకు చెప్పా... 'గుమాస్తామీద ఓ కన్నేసి ఉంచ'మని. మేనేజరు నెలరోజుల కిందట అడిగిన అడ్వాన్సు వచ్చే నెల ఇస్తా నన్నాను.

* * *

ఆ రాత్రి పాకలో నాకు ఏ లోటూ రాకుండా చూశాడు గుమాస్తా. కోడి మాంసం, పైనూ అమర్చాడు. కూలీలకు నేను నచ్చచెప్పిన తీరుకు తెగ పొగుడు తున్నాడు.

అతన్ని ఆపాను.


"ఈ మేనేజరు లెక్కలు సరిగ్గా ఉంటున్నాయో లేదో కాస్త కనిపెట్టి ఉండవోయ్- నువ్వే నాకు నమ్మకమైన వాడివీ- పైకి రావల్సినవాడివీ" అని గుమాస్తాకు సలహా ఇచ్చాను.

అతని ముఖం చాటంతైంది.

కాసేపు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పి వెళ్ళిపోయాడు.

* * *

అంతా సవ్యంగానే ఉంది? అనుకో కుండా వచ్చిన సమస్య ఎంత సులభంగా పరిష్కారమైంది?



'నే నెప్పుడూ అదృష్టవంతుడ్నే' అని నవ్వుకుని, తృప్తిగా కళ్ళు మూసుకోబోయాను.

కాని ఇంతలోనే ఆయన వలాయింపు మొదలైంది.

'—ఔను అదృష్టవంతులు మీరు- వడ్డించిన విస్తరి మీ జీవితం' అని గొణగసాగాడు.

ఉలిక్కిపడ్డాను! ఇక నిద్ర పోనివ్వ లేదు.

'సమ్మె కట్టిన కూలీలంటాడు... వాళ్ళ భార్యలంటాడు- రోగార్తుని రక్త నాళాలంటాడు- పడుపుకత్తె బాధల పాటలంటాడు— ఉరితీయబడ్డ శిరస్సు లంటాడు.'

ఆయన పోరు పడలేక పాకలోంచి బయటకొచ్చాను.

తెల్లని వెన్నెల— చల్లని గాలి— ప్రాణానికి ఊరటనిచ్చాయి. ముందుకు కదిలాను.

అయినా ఆయన నన్నొదలక వెంట బడ్డాడు.

చిల్లులుపడ్డ తారురేకులు, చివికి పోయిన గోనెగుడ్డలతో వేసుకున్న పాకల్లో- కూలీలు చలికి వజవజ వణుకు తూనే- గాఢంగా నిద్రపోతున్నారు.

'చూడు చూడు పీడలు-పీడలు పొగ మేడలు' అరుస్తున్నాడాయన. 'బక్క- చిక్కి- బిక్కచచ్చిపడిన బతుకు గోడలు- పొదిగిటిలో ఒదిగిలపడు విర్భాగ్యపు

పీడలు- చూడు' అని అదిలిస్తున్నాడు.

ఆయన్నెలా వదిలించుకోవాలో అర్థం కాలేదు. 'కారులో కొండదారిన పరిగెత్తితేనైనా పీడ తీరతానేమో— ఈయనను తప్పించుకుంటానేమో!"

మెల్లిగా కొండ దిగి, కారు ఉన్న వైపు కదలసాగాను.

కారుకు దగ్గరవుతున్న కొద్దీ ఏదో శబ్దం- దేన్నో పగలగొడుతున్నట్లు, వేటినో చింపుతున్నట్లు!

అనుమానంగా నడక వేగం పెంచాను.

కారును సమీపించగానే కనిపించిన దృశ్యం నన్ను దిగ్భ్రాంతుణ్ని చేసింది. కారు విండో అద్దాలు పెంకులు పెంకులుగా పగిలి రోడ్డుమీద పడిఉన్నాయి— వెన్నెల్లో వెండి తునకల్లా ధగధగలాడుతూ! పగిలిన విండోలోంచి చివిగిన సీటు గుడ్డలు, స్పాంజి ఉండలు బయటకు విసురుగా పడుతున్నాయి.

విండోలోంచి ఒంగి భయంగా లోపలికి చూశాను.

ఆ కుర్రాడు మోకాళ్ళమీద కూర్చుని రాయితో స్టీరింగ్ వీలును మోదుతున్నాడు. నేను వచ్చింది పట్టించుకోకుండా తన పని శ్రద్ధగా నెరవేరుస్తున్నాడు.

చిన్నగా దగ్గాను.

వాడు ఉలిక్కిపడి విండోలోంచి తల బయటపెట్టి నన్ను చూశాడు. ఒక్క గెంతులో కిందకు దూకాడు.

వాడు- 'రామయ్య కొడుకు!'

కారుకేసి ఆశ్చర్యంగా చూశాను. డోర్లు సొట్టలుపడ్డై— విండో అద్దాలు పగిలినై — సీట్లు చివిగినై —స్టీరింగ్ వీలు వంకర తిరిగింది- ఏమిటిది!!

అంతలో నవ్వు- ఆయన నవ్వు.

'అరె ఝూ!! ఝూ! ఝటక్, ఫటక్- హింసనచణ ధ్వంసరచన! ధ్వంసనచణ హింసరచన" అంటూ ఆయన వెటకారంగా నవ్వుతున్నాడు పగలబడి.

ఆ కుర్రవాడికేసి చూశాను. నాకు నాలుగడుగుల దూరంలో నిలబడి నన్నే చూస్తున్నాడు.

రెండు నిమిషాలు మౌనంగా, ఆశ్చర్యంగా ఒకర్నొకరం చూసుకున్నాం.

నేను తేరుకున్నాను.

"ఏం పనిరా ఇది?" కోపంగా అడుగుతూ వాడివైపు ఓ అడుగు వేశాను.

వాడు అంగుళం కూడా కదల్లేదు.

వాడి కళ్ళలో కసి, నిర్లక్ష్యం—

పొగరుగా తలెగరేశాడు!

'యముని మహిషపు లోహఘంటలు ఖణేల్మన్నాయి- నరకలోకపు జాగిలమ్ములు గొలుసు త్రెంచుకు ఉరికి పడ్డాలు.'

భయంగా ఆగిపోయాను.

'—పుడమి తల్లికి పురిటినెప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించాయి' నా చెవిలో చెబుతున్నాడాయన.

మళ్ళీ కుర్రవాడికేసి చూడలేకపోయాను.

బెదురుగా వెనక్కి తిరిగి వచ్చిన దారినే నడవసాగాను.